క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: ఏ ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం లేకపోతే ఏ పని చేయలేరని జీవన విధానం ముందుకు సాగదని పోతునూరు వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం పోతునూరు పాఠశాలల్లో విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే పరీక్షలు నిర్వహించారు. రక్తం గ్రూపు రక్తహీనత అనారోగ్యంతో పాటు ఇతర పరీక్షలు నిర్వహించి వివరాలు నమోదు చేసుకొని విద్యార్థులకు మందులు అందజేశారు. ఆహారపు అలవాట్లు, పరిమితి నిద్ర, సెల్‌ఫోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. పాఠశాలల్లో ఎంపీహెచ్‌ఓ ప్రభాకర్, సూపర్‌వైజర్ హరి, వైద్య సిబ్బంది, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రతపై బుర్రకథ



బుర్ర కథ ప్రదర్శిస్తున్న కళాకారులు

ఉంగుటూరు: పరిసరాల పరిశుభ్రతపై చేబ్రోలు గ్రామంలో బుర్రకథ చెప్పి ఆకట్టుకున్నారు. ఏలూరుకు చెందిన కీర్తన కల్చరల్ సొసైటీకి చెందిన ఎం.ప్రశాంత్‌కుమార్ టీం సభ్యులు ఆధ్వర్యంలో పరిసరాలు పరిశుభ్రత, పీఎంఎస్‌బీవై, వ్యక్తిగత శుభ్రత, ప్లాస్టిక్ నిషేధం అంశాలపై విద్యార్థులను చైతన్నపరిచారు. డిప్యూటీ ఎంపీడీవో బి.శ్రీనివాస్ పర్యవేక్షించారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



రాధా కృష్ణుల కల్యాణం చేయిస్తున్న అర్చకులు

ఉంగుటూరు: కైకరం సాయిబాబా ఆలయంలో రాధాకృష్ణుల కల్యాణం వైభవం నిర్వహించారు. సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కల్యాణోత్సవంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. పెద్దిరెడ్డి వేణు గోపాలకృష్ణ ప్రసాదరావు, శేషవేణి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్త ముత్తంగి వెంకట వేణుగోపాల్ పర్యవేక్షణలో నిర్వహించారు. విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు. ప్రసాద వితరణ, మహిళలకు తాంబూలాలు అందించారు.

ప్రతిష్ఠా విగ్రహాల ఊరేగింపు



విగ్రహాలను ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

దెందులూరు: గోపన్నపాలెం శ్రీకోదండ రామాలయంలో ఈ నెల 4న ప్రతిష్ఠించనున్న శ్రీసీతా రామ, లక్ష్మణ, ఆంజనేయ, గణేశ సుబ్రమణ్య శ్రీకృష్ణ అయ్యప్ప స్వామి వార్ల విగ్రహాలను శుక్రవారం గోపన్నపాలెంలో ఊరేగించారు. ఉదయం ఆలయంలో ఈశ్వర పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశ్నణ, రిత్విక్ వరుణ దీక్షరాదన, వాస్తు, బలి నవగ్రహ అష్టదిక్పాలక మండపాల ఆరాధన, అంకురారోహణ అగ్ని ప్రతిష్ఠాపన, ధాన్యాదివాసం, పుష్పాదివాసం యంత్రాలకు మంత్ర జపాలు, తర్పణాలు, వేద పారాయణ స్వస్తివాచకాలు, వాస్తు హోమం ప్రధాన కలశ ఆవాహన నక్షత్ర మండపారాధన నిర్వహించారు.

ఫ్రైడే-డ్రైడే నిర్వహణ



ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

దెందులూరు: వ్యక్తిగత పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం అభివృద్ధి లభిస్తుందని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం పోతునూరులో ఫ్రైడే నిర్వహించారు. గ్రామాల్లో ర్యాలీ చేసి వ్యక్తిగత సామూహిక పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనారోగ్యం సంభవిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకొని మందులు వాడాలన్నారు.ఎంపీహెచ్‌ఓ ప్రభాకర్, సూపర్‌వైజర్ హరి, ఏఎన్ఎంలు పద్మావతి, రత్నకుమారి పాల్గొన్నారు.

నేడు నిధుల విడుదల

దెందులూరు: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ మొదటి విడత నిధులు శనివారం మండలంలోని పోతునూరులోని స్వరాజ్ భవన్‌లో స్థానిక ఎమ్మెల్యే విడుదల చేస్తారని వ్యవసాయ శాఖ అధికారి ఎల్.శ్రీనివాసరాజు తెలిపారు. సంబంధిత అధికారులు, రైతులు సమావేశంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

రైతన్నకు దన్ను.. అంతర పంటల సాగు

- అంతర పంటల్లో సుగంధాల గుబాళింపు
- ఆర్థికంగా పురోభివృద్ధి చెందుతున్న రైతులు
- అంతర పంటల సాగుకు అన్నదాతల మొగ్గు



లక్ష్మీపురంలో కొబ్బరి తోటలో అంతర పంటలుగా సాగు చేస్తున్న వక్క, మిరియాలు, తమల పాకు



మిరియాలు, వక్కలో అంతర పంటగా సాగు చేస్తున్న పసుపు

పెదవేగి: అంతర పంటల సాగు కొబ్బరి తోటల రైతుల పాలిట కల్పతరువుగా చెప్పుకోవచ్చు. కొందరు రైతులు అంతర పంటల పట్ల అవగాహన లేకపోవడంతో ఎంతో ఆదాయాన్ని కోల్పోతున్నారు. పాక్షిక నీడనిచ్చే కొబ్బరి వాతావరణంలో ఎన్నో రకాల వాణిజ్య పంటలను సాగు చేసుకోవచ్చు. ఇది రైతుకు అన్నివిధాల కలిసొచ్చే అంశం. కొబ్బరిలో ఎటువంటి అంతర పంటలు సాగు చేయొచ్చు. ప్రధాన పంటలకు దీటుగా అంతర పంటల నుంచి ఏ విధంగా ఆదాయం పొందొచ్చనే విషయాలను పరిశీలిద్దాం. కొబ్బరిసాగు విస్తీర్ణం గోదావరి జిల్లాలో అత్యధికంగా ఉంది. అధిక వర్ష పాతం, గాలిలో తేమ శాతం అధికంగా ఉండే కోస్తా జిల్లాలు కొబ్బరి పెరుగుదలకు అనుకూలంగా ఉంటాయి. కొబ్బరి మొత్తం విస్తీర్ణంలో 50 శాతం పైగా గోదావరి జిల్లాల్లోనే ఉంది. కొబ్బరిలో అంతర పంటల సాగుకు సైతం అన్నదాతలు మొగ్గు చూపుతున్నారు.

అంతర పంటల వైపు అన్నదాత చూపు

దెందులూరు నియోకవర్గంలో అంతర పంటల సాగుకు అన్నదాతలు మక్కువ చూపి అధిక ఆదాయాన్ని అర్జిస్తున్నారు. సంప్రదాయ పంటలకన్నా భిన్నంగా అంతర పంటలు కాసుల పంట పండిస్తుండటంతో రైతన్నలు వీటి సాగు వైపు అడుగులు వేస్తున్నారు. కొబ్బరిలో కోకో, వక్క, మిరియాలు, అల్లం, పసుపు, దాల్చిన చెక్క వంటివి సాగు చేస్తున్నారు. అంతర పంటల ద్వారా నీటి యాజమాన్యం ఎరువుల ఆదా అవుతున్నాయి. దీంతో పాటు ఆదాయం అధికంగా వస్తుంది. కొబ్బరిలో ఎకరాకు 200 నుంచి 500 మొక్కల వరకు మూడు మీటర్ల దూరంతో వక్క మొక్కలు నాటుకోవచ్చని ఉద్యాన వన అధికారులు సూచిస్తున్నారు. దెందులూరు నియోజకవర్గంలో 12 వేల ఎకరాల్లో కొబ్బరి ఉండగా అందులో 8 వేల ఎకరాల్లో కోకో అంతర పంటగా ఉంది. నియోజక వర్గంలో 500 ఎకరాల్లో ఎక్కువ అంతర పంటలు సాగు చేస్తున్నారు.

అంతర పంటలతో అధిక దిగుబడి



13 సంవత్సరాలుగా ఆర్గానిక్ పద్ధతిలో అంతర పంటలను పండిస్తున్నాను. దీంతో అధిక దిగుబడి లభిస్తుంది. కొబ్బరిలో మిశ్రమ పంటలుగా వక్క, మిరియాలు, పసుపు అల్లం సాగు చేస్తున్నాను. తోటలో 2500 వక్క చెట్లు ఉండగా 700 చెట్లు కాస్తున్నాయి. 2 టన్నుల ఎండు కాయలు దిగుబడి వచ్చింది. వాటిని అమ్మితే రూ.3.80 లక్షలు వచ్చింది. కొబ్బరిలో 300 చెట్లకు మిరియాలు అంతర పంటగా సాగు చేస్తున్నాను. 200 చెట్లు కాపు కాస్తున్నాయి. కేజీ 600 చొప్పున విక్రయిస్తున్నాం. కొబ్బరిని సోలార్ డ్రయ్యర్ల ద్వారా నూనె తయారు చేస్తున్నాం. సిలోన్ వెరైటీ దాల్చిన చెక్కను సాగు చేస్తున్నాం.

– ఉప్పలపాటి చక్రపాణి, రైతు, లక్ష్మీపురం

రైతులకు అధిక ఆదాయం



తక్కువ వ్యవసాయ క్షేత్రంలో ఎక్కువగా పంటలు పండించడం వలన రైతులకు అధిక ఆదాయం వస్తుంది. పామాయిల్ కొబ్బరిలో ఎక్కువగా అంతర పంటలు పండిస్తూ పెదవేగి మండలంలో రైతులు ఆదాయం పొందేలా సబ్సిడీలు ప్రభు త్వం అందజేస్తుంది. గ్రామ స్థాయిలో రైతు భరోసా కేంద్రాల ద్వారా వారికి పంటల సస్యరక్షణకు అవగాహన కల్పిస్తున్నాం. క్షేత్ర పరిశీలనలో రైతులకు అవసరమైన సూచనలు, సలహాలను అందజేస్తున్నాం.

– ఎం.రత్నమాల, ఉద్యాన అధికారి, పెదవేగి మండలం

కూటమి మోసాలను ఎండగట్టాలి

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు నేరుగా లబ్ధి
- చంద్రబాబు ఏడాదిలో 3 లక్షల ఉద్యోగాలను తొలగించారు
- నాటి పాలన పారదర్శకం.. నేటి పాలన మోసపూరితం
- మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సలహా కమిటీ సభ్యుడు వాసుబాబు ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు పుప్పాల వాసుబాబు



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

ఉంగుటూరు: చంద్రబాబు మోసం చేసి పాలన సాగిస్తున్నారని ఈ విషయం ప్రజలకు తెలిజేయాల్సిన బాధ్యత ప్రధాన ప్రతిపక్షంగా మనపై ఉందని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సలహా కమిటీ సభ్యుడు పుప్పాల వాసుబాబు అన్నారు. శుక్రవారం ఉంగుటూరులో డాక్టర్ పాతూరి శివన్నారాయణ కమ్మ కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు అధ్యక్షతన మండల స్థాయి కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వాసుబాబు మాట్లాడుతూ చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తూ జగనన్న పథకాల అమలు తీరును వివరించాలన్నారు. భవిష్యత్తులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం తీరును ఎండగట్టి ఒత్తిడి తీసుకురాబట్టే తల్లికి వందనం వేశారని, అదీ రెండు వేలు తక్కువగా వేశారన్నారు. 14 నెలలు చంద్రబాబు పాలనలో 1 లక్షా 70 వేల కోట్ల అప్పులు చేసి తల్లికి వందనం పథకానికి రూ.7 వేల కోట్లు ఖర్చు చేస్తే మిగిలిన సొమ్ములు దేనికి ఖర్చు చేశారో వెల్లడించాలని వాసుబాబు ప్రశ్నించారు. మహిళలకు ఇస్తానన్న రూ.1500 పథకం ఏమైందని, నిరుద్యోగులకు రూ.3 వేలు ఎప్పుడిస్తారని వాసుబాబు ప్రశ్నల వర్షం కురిపించారు. కొత్త ఉద్యోగాలను ఇవ్వక పోగా రేషన్ వాహనాలను, వలంటీర్లను రోడ్డున పడేశారన్నారు. చంద్రబాబుకు వత్తాసు పలికి ప్రభుత్వంలో చేరిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు మాట్లాడుతూ ఎన్నికల్లో అబద్ధపు హామీలను ఇచ్చి అధికారం చేపట్టిన కూటమి పాలన అస్తవ్యస్తంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సయ్యద్ బాజి మాట్లాడుతూ నియంతలా చంద్రబాబు పాలన సాగిస్తున్నారని అన్నారు. చంద్రబాబు మోసాలను ఎండగట్టి పార్టీని గ్రామ స్థాయిలో బలోపేతం చేద్దామని అన్నారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు కూటమి పాలనలో రక్షణ లేదన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి పెనుగొండ బాలకృష్ణ మాట్లాడుతూ కూటమి పాలనలో వనరులు దోచుకు తిన్నారని ఇదేమిటని ప్రశ్నిస్తే భూగర్భ జలాలు పెరుగుతాయని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మంద జయలక్ష్మి మాట్లాడుతూ పార్టీ కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు చంద్రబాబు మోసాలు, ఇచ్చిన హామీలతో కూడిన క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, వైఎస్సార్ సీపీ బూత్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి యెలిశెట్టి పాపారావుబాబ్జి, బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెనుగొండ బాలకృష్ణ, భీమడోలు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు రాయిపాటి సత్య శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు కొరిపల్లి శ్రీను, పాత్తూరి శ్రీనివాసరాజు (గెడ్డం శ్రీను), పుప్పాల గోపి, మిద్దే వెంకటేశ్వరరావు, తమ్మిన శ్రీను, కొండ్రెడ్డి సర్వేశ్వరావు, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కళా రంగానికి సేవలందించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రభుత్వ ఉద్యోగిగా పదవీ విరమణ పొందినా కళాకారునిగా కళారంగానికి పూర్తి స్థాయిలో సేవలందించాలని పలువురు వక్తలు ఎండీ ఖాజావలీని కోరారు. స్టేట్ ఆడిట్ శాఖలో ఆడిటర్‌గా పని చేస్తూ గత నెల 31న పదవీ విరమణ చేసిన ఖాజా వలీ పదవీ విరమణ అభినందన సభ శుక్రవారం స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి హాల్‌లో నిర్వహించారు. జిల్లా పౌర సంబంధాధికారి రామచంద్రరావు, నగరానికి చెందిన వివిధ కళా సంస్థల ప్రతినిధులు గరికపాటి కాళిదాసు, పుల్లాభొట్ల పురుషోత్తమ రావు, పెదపాటి రామకృష్ణ, గురు శర్మ, తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాక్షేత్రం అధినేత బీవీ రామారావు, ఆలపాటి నాగేశ్వర రావు, తెలుగు చరయితల సంఘం ప్రతినిధులు, లంకా వెంకటేశ్వర్లు, నాగాస్త్రి, లేళ్ల వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

చిత్రహింసలకు గురిచేశారంటూ ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): అకారణంగా కట్టేసి కొట్టి చిత్రహింసలకు గురిచేసిన వ్యక్తులను అరెస్ట్ చేశాలని, తలారి ప్రకాష్‌పై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అఖిల భారత రైతు కూలీ సంఘం ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తలారి ప్రకాష్‌పై ఇటీవల రైస్ మిల్లు స్థలం విషయంలో అకారణంగా దాడి చేసి, తాళ్లతో బంధించి చిత్రహింసలకు గురి చేశారని తెలిపారు. బాధితుడు ప్రకాష్ మాట్లాడుతూ కామవరపుకోట మండలం జోగడగూడెంలో తాను నివాసం ఉంటూ పదేళ్ల నుంచి రైస్ మిల్లు స్థలం లీజుకు తీసుకొని సిమెంట్ తూరలు తయారు చేస్తున్నానని తెలిపారు. తన స్థలంలో కొందరు ఆకతాయిలు గంజాయి మద్యం సేవిస్తున్నారని, దీంతో స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేస్తుండగా అదే గ్రామానికి చెందిన 12 మంది అకారణంగా దాడి చేసి కొట్టారని వివరించారు. కులం పేరుతో దూషించారని తెలిపారు. తనపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేసి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పీడీఎస్‌యూ జంగారెడ్డిగూడెం నాయకులు మామిడి రూపశంకర్, పి.రమేష్, జి.సత్యానారాయణ, అఖిలభారత రైతు కూలీ సంఘం నాయకులు ఏసు పాదం తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై కలెక్టర్ ఆరా



ప్రజా సమస్యలు తెలుసుకుటున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (టూటౌన్): స్థానిక 37, 38 డివిజన్లలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రాంతాల్లో స్థానిక సమస్యలను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం ఆర్ఆర్ పేట, గుబ్బలవారి వీధుల్లో పర్యటించిన కలెక్టర్ ప్రజలతోనేరుగా మాట్లాడారు. మంచినీటి సదుపాయం, డ్రెయిన్ల నిర్వహణ, కార్పొరేషన్ నుంచి రోజు చెత్త సేకరణ తదితర అంశాలపై ఆరా తీశారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, తహసీల్దారు గాయత్రి, ప్రజాప్రతినిధులు నాయుడు సోము, ఈతకోట శ్రీనివాసరావు ఉన్నారు.

నేడు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ

భీమడోలు: భీమడోలులో ఈ నెల 2వ తేదీ శనివారం సాయంత్రం 4 గంటలకు బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ మండల స్థాయి విస్తృత సమావేశం నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు శుక్రవారం రాత్రి తెలిపారు. భీమడోలులోని వీసీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి మండల వ్యాప్తంగా అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

దత్త క్షేత్రంలో గరుకు స్తంభం ఏర్పాటు



గరుకు స్తంభం ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: బాదంపూడి దత్త బాల సుబ్రహమణ్యస్వామి ఆలయం వద్ద గోశాలను ఆనుకొని గరుకు స్తంభాన్ని నెలకొల్పారు. ఆర్యవైశ్య సంఘం తరపున కొత్త పుల్లేశ్వరరావు కటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన ఈ స్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. గోవుల సౌకర్యార్థం ఈ స్తంభాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్మాత కలవచర్ల శ్రీనివాసు తెలిపారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కరువు



మాట్లాడుతున్న సీఐటీయూ నేత

భీమడోలు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో కార్మికులు ఉద్యోగ భద్రత కోల్పోతున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు అన్నారు. భీమడోలు సీఐటీయు కార్యాలయంలో శుక్రవారం మండల మహాసభ సీనియర్ నాయకులు బెండి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్.లింగరాజు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. కార్మికుల పాలిట శాపంగా ఉన్న లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పోచమ్మ, నాయకురాలు స్వర్ణకుమారి, కార్మికులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సమావేశాన్ని విజయవంతం చేయాలి



మాజీ ఎమ్మెల్యేను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

దెందులూరు: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం రాయన్నపాలెంలో దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిని కలిశారు. జిల్లా స్థాయి సమావేశం ఏర్పాట్ల గురించి వివరించారు. జిల్లా సమావేశానికి హాజరుకావాలని అబ్బయ్య చౌదరిని ఆహ్వానించారు. కార్యక్రమంలో వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్, దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ అప్పన ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాటి సుధాకర్, జిల్లా కార్యదర్శి ప్రేమ్ బాబు, చల్ల మేరీరాజు, నాయకులు దేవానంద్, బత్తుల ఏసురాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం పద్మజ, నాటిక బృందం

భీమడోలు: ప్రతి విద్యార్థి చదువుకుని తమ వ్యక్తిగత, కుటుంబ, సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.పద్మజ అన్నారు. జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం సాయంత్రం చైల్డ్ రైట్స్ అడ్వకెసీ ఫౌండేషన్ (క్రాఫ్) ఆధ్వర్యంలో బాల్య వివాహాల వ్యతిరేక ప్రచారోద్యమంలో భాగంగా వీధి నాటక ప్రదర్శన చేశారు. చదువు వలన కలిగే ప్రయోజనాలు, బాల్య వివాహాలు నిరోధం తదితర అంశాలపై కల్చరల్ సొసైటీ కళాబృందం సభ్యులు రవికుమార్, రంగనాయకి, శ్రావణి, మహేష్, చిన్ని తదితరులు నాటక రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి క్రాఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.రవిబాబు అధ్యక్షత వహించారు. హెచ్‌ఎం ఎస్.పద్మజ మాట్లాడుతూ బాల్య వివాహాల వలన బాలికల ఆరోగ్యం, చదువుకు దూరమవుతున్నారన్నారు. జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.రవిబాబు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండని మైనర్లకు వివాహాలు చేస్తే అలాంటి వారిని చట్టం కఠినంగా శిక్షిస్తుందన్నారు. గ్రామాల్లో అలాంటి సంఘటనలు జరిగినట్లయితే మహిళా కానిస్టేబుల్, గ్రామ కార్యదర్శి, వీఆర్వోలకు సమాచారం అందించాలన్నారు. చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ హెల్ప్‌లైన్ 100, టోల్ ఫ్రీ నంబర్ 112కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.త్రిపుర, స్వాతి, డీఎల్ సోమశేఖర్, వై.సోమశేఖర్, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు దివ్య ఔషధం



తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారిణి పి.అరుణజ్యోతి, ఎంపీహెచ్ఈవో వైవీ లక్ష్మణరావు

భీమడోలు: పుట్టిన బిడ్డకు తల్లిపాలు దివ్య ఔషధమని పూళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పి.అరుణజ్యోతి అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా తొలి రోజైన శుక్రవారం పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రి వద్ద తల్లులు, గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి తల్లి పాల విశిష్టతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీహెచ్ఈవో వైవీ లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వైవీ లక్ష్మణరావు, సీహెచ్ఎస్ అనూరాధ, సూపర్‌వైజర్లు శ్రీనివాసరావు, పి.మావుళ్లమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

బిడ్డకు పాలు పట్టడం ద్వారా తల్లికి వ్యాధులు దూరం

పుట్టిన బిడ్డకు పాలు పట్టడం ద్వారా తల్లికి ప్రాణాంతక వ్యాధులు దరి చేరవని గుండుగొలను వైద్యాధికారిణి డాక్టర్ ఆర్.జాహ్నవి అన్నారు. గుండుగొలను, పూళ్ల పీహెచ్‌సీల పరిధిల్లో శుక్రవారం గుండుగొలను అంగన్‌వాడీ కేంద్రం వద్ద ప్రపంచ తల్లి పాలవారోత్సవాలను పురస్కరించుకొని గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. అంబర్‌పేటలో ర్యాలీ చేశారు. సూపర్‌వైజర్లు ఎం.కవిత, నూర్జహాన్, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.రాజమణి, రమాదేవి, సత్యవేణి, అన్నమ్మ, మహిళా పోలీస్ ఎం.లక్ష్మీ, ఎఎన్ఎం రత్నకుమారి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపరచాలి



మోడల్ స్కూల్‌లో టీచర్ల హ్యాండ్ బుక్కులను పరిశీలిస్తున్న ఎంఈవో-2 భాస్కర్‌కుమార్

భీమడోలు: విద్యార్థుల్లో అభ్యాసనా సామర్థ్యాలను మెరుగు పరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈవో-2 అయినపర్తి భాస్కర్‌కుమార్ అన్నారు. గుండుగొలను నంబర్-1 మోడల్ పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. తరగతుల వారీగా విద్యార్థుల వివరాలతో పాటు వారి బోధనాభ్యసనాల సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. రికార్డులు, రిజిస్టర్లను ఆయన పరిశీలించి హెచ్‌ఎంకు పలు సూచనలు అందించారు. సిలబస్ ఏ మేరకు పూర్తి చేశారని ఆయన వారిని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హ్యాండ్ బుక్కులు, విద్యార్థుల వర్క్ బుక్కులను పరిశీలించారు. ఈ నెలలో నిర్వహించే ఫార్మేటివ్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని కోరారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల టీచర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. చిన్నారులకు వైద్య ఆరోగ్య సిబ్బంది హీమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాశం పాండురంగారావు, టీచర్లు సంధ్య, దీప్తి, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక మోసాలపై అవగాహన



ఎస్సై శివాజీ

దెందులూరు: వాయిస్ క్లోనింగ్ స్కాంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని ఏ ఒక్కరూ వాయిస్ క్లోనింగ్ స్కాంలో చిక్కుకోవద్దని ఎస్సై ఆర్.శివాజీ అన్నారు. శుక్రవారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కె.ప్రతాప శివ కిషోర్ ఆదేశాల మేరకు యువతతో పాటు ప్రజలకు సాంకేతిక మోసాలపై అవగాహన కల్పించే లక్ష్యంలో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, శిక్షణ సంస్థల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు. మీ సన్నిహితుల వాయిస్‌లతో ఫోన్లు చేస్తారని అత్యవసరంగా డబ్బులు కావాలంటారన్నారు. ఆపదలో ఉన్నానని దయ చేసి ఆదుకోండంటూ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(ఏఐ) ఉపయోగించి చేస్తున్న మోసమని ఎస్సై అన్నారు. అపరిచిత నంబర్ల నుంచి మీ స్నేహితులు, బంధువులు వాయిస్‌తో ఫోన్ కాల్స్ వస్తే నిజ నిర్ధారణ చేసుకోవాలన్నారు. ఏమైనా అనుమానాలు ఉంటే వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఎస్సై శివాజీ సూచించారు.